



PRGI NO : TGTEL /25/A0438

# స్టార్ త్రినేత్రం

అనుక్షణం అక్షరసత్యం

తెలుగు దినపత్రిక






| వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 8 | ఎడిటర్ : డీ.శివకృష్ణ | గురువారం, 05 జూన్ 2025 | పేజీలు : 4 | వెల : 2 |
|---|---|---|---|---|---|---|
| WARANGAL | VOL-1 | ISSUE-08 | Editor: D.SHIVAKRISHNA | THURSDAY 05 JUNE 2025 | Pages:4 | Price:2 |








# చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట.. 11 మంది మృతి

**బెంగళూరు,స్టార్ త్రినేత్రం**

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద బుధవారం అపశ్రుతి చోటు చేసుకుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 18 ఏళ్ల నిరీక్షణ తర్వాత కప్పు సాధించిన ఆనందంలో అభిమానులు భారీగా చిన్నస్వామి స్టేడియం వద్దకు చేరుకున్నారు. దీంతో అక్కడ భారీగా తొక్కిసలాట జరిగింది. చిన్నస్వామి స్టేడియం లోపలికి అభిమానులు తోసుకెళ్లేందుకు ప్రయత్నించారు. బారికేడ్లు దూకి స్టేడియంలోకి వెళ్లేందుకు అభిమానులు ప్రయత్నించారు. భారీ సంఖ్యలో వచ్చిన అభిమానులను పోలీసులు నియంత్రించలేకపోయారు. దీంతో అక్కడ తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 11 మంది మృతి చెందారు. మరో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. దాదాపు 50 మంది గాయాలపాలయ్యారు. వారిని వివిధ అస్పత్రులకు తరలించారు. అభిమానులను నియంత్రించేందుకు చిన్నస్వామి స్టేడియం దగ్గర పోలీసులు లాఠీఛార్జ్ ప్రారంభించారు. స్టేడియం ఖాళీ చేయాలని అభిమానులకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



## బెంగళూరు తొక్కిసలాట ఘటనపై ప్రధాని మోదీ రియాక్షన్

బెంగళూరులో బుధవారం జరిగిన తొక్కిసలాట ఘటన ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారిపోయింది. ఈ ఘటనపై భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన హృదయ విదారకమైనదని, ఈ కష్ట సమయంలో తమ ప్రియమైనవారిని కోల్పోయిన కుటుంబాల పట్ల ప్రధాని మోదీ సానుభూతి వ్యక్తం చేశారు. దీంతోపాటు మృతుల కుటుంబాలకు పీఎంఎన్‌ఆర్‌ఎఫ్ నుంచి రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50,000 చొప్పున పరిహారం ప్రకటించారు.



## తొక్కిసలాట భయానక దృశ్యాల్ని మిగిల్చింది: సీఎం సిద్ధ రామయ్య



వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 8 | ఎడిటర్ : డీ.శివకృష్ణ | గురువారం, 05 జూన్ 2025 | పేజీలు : 4 | వెల : 2
WARANGAL 2 VOL-1 ISSUE-08 Editor: D.SHIVAKRISHNA THURSDAY 05 JUNE 2025 Pages:4 Price:2

# తొక్కిసలాట భయానక దృశ్యాల్ని మిగిల్చింది: సీఎం సిద్ధ రామయ్య

**స్టేడియం సామర్థ్యం 35,000 మంది**
**రెండు నుంచి మూడు లక్షల మంది హాజరు**
**మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ప్రకటించిన సీఎం**

**ఇంటర్నెట్ డెస్క్:**

బెంగళూరులో ఆర్సీబీ విజయోత్సవ ర్యాలీ వేడుకల్లో జరిగిన తొక్కిసలాట భయానక దృశ్యాల్ని మిగిల్చింది. ఈ ఘటనలో 11 మంది మరణించారు. ఈ విషాదకర ఘటనపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా స్పందించారు. ఈ వేడుకలకు మేము ఊహించలేని విధంగా జనాలు వచ్చారని సీఎం అన్నారు. స్టేడియం సామర్థ్యం 35,000 మంది కాగా, అనూహ్యంగా రెండు నుంచి మూడు లక్షల మంది హాజరయ్యారని వెల్లడించారు.


అంత భారీగా జనాలు రావడం వల్ల సరైన ఏర్పాట్లు చేయడానికి సమయం సరిపోలేదని సీఎం సిద్ధరామయ్య వివరించారు. ఇదే సమయంలో సీఎం మెజిస్ట్రేట్ స్థాయి విచారణకు ఆదేశించారు. దీంతోపాటు మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం, గాయపడినవారికి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో ఉచిత వైద్యం అందిస్తామన్నారు. ప్రభుత్వం బాధితుల పట్ల పూర్తి మద్దతుగా ఉందని సీఎం హామీ ఇచ్చారు.

# ఆర్సీబీ విక్టరీ పరేడ్ తొక్కిసలాటపై కర్ణాటక ప్రభుత్వం క్షమాపణ



బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద చోటుచేసుకున్న తొక్కిసలాటపై కర్ణాటక ప్రభుత్వం స్పందించింది. తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. తొక్కిసలాటలో మృతిచెందిన వారి కుటుంబాలకు ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ క్షమాపణలు చెప్పారు. ఆర్సీబీ అభిమానులు బారీగా తరలిరావడంతో అదుపు చేయలేకపోయామని, వైఫల్యం తమదేనని ఆయన చెప్పారు. మరోవైపు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య క్షతగాత్రులు చికిత్స పొందుతున్న బౌరింగ్ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. బాధిలందరికీ సరైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కాగా ఐపీఎల్-2025 కప్పు గెలిచిన ఆర్సీబీ ఆటగాళ్లు ఇవాళ బెంగళూరుకు చేరుకున్నారు. దాంతో కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారికి సన్మానం చేసేందుకు చిన్నస్వామి స్టేడియంలో ఏర్పాట్లు చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొనేందుకు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దాంతో వారిని అదుపుచేయడం అక్కడున్న పోలీసులకు సాధ్యంకాలేదు. అభిమానులు బారికేడ్లను తోసుకుని స్టేడియంలోకి పరుగులు తీశారు. దాంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ తొక్కిసలాటలో 11 మంది మరణించారు. దాదాపు 50 మంది గాయపడ్డారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

# తొక్కిసలాట ఘటనపై స్పందించిన సీఎం చంద్రబాబు




కర్ణాటక రాజధాని బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో చాలా మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన తనను బాధించిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. చనిపోయిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా సీఎం చంద్రబాబు నాయుడు స్పందించారు. ఈ తొక్కిసలాట ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ఆర్సీబీ విజయోత్సవాల్లో జరిగిన విషాదం దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. మృతుల్లో చిన్నారులు సైతం ఉండడం మరింత బాధకరమని చెప్పారు. వేడుకల్లో ఇంత విషాదం జరగడం చాలా దురదృష్టకరమని తెలిపారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

# బెంగళూరు తొక్కిసలాట బాధిస్తోంది: పవన్ కళ్యాణ్



బెంగళూరులో ఆర్సీబీ విజయోత్సవ కార్యక్రమంలో తొక్కిసలాట ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారు. ఈ ఘటన తననెంతో కలిచివేసిందంటూ పవన్ కళ్యాణ్ ట్వీట్ చేశారు. బాధితుల్లో చిన్నారులు కూడా ఉన్నారన్న వార్తలు మరింత బాధను కలిగిస్తున్నాయన్న పవన్ కళ్యాణ్.. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు పవన్ కళ్యాణ్ ట్వీట్ చేశారు.

# కూకట్‌పల్లి, సూరారంలో ఆర్సీబీ అభిమానుల వీరంగం

**హైదరాబాద్, స్టార్ త్రినేత్రం:**

ఐపీఎల్ ఫైనల్‌లో ఆర్సీబీ గెలుపుతో హైదరాబాద్‌లో అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు. ఎక్కడికక్కడ వీధుల్లోకి వచ్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అయితే కూకట్‌పల్లిలో కొంతమంది అభిమానుల అత్యుత్సాహం ప్రదర్శించారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులు ఒక్కసారిగా రోడ్లపైకి వచ్చి చిందులేశారు. బస్సులు, లారీలు ఎక్కి విరాట్ కోహ్లీ ఫ్లెక్సీలు ప్రదర్శించారు. అభిమానుల వీరంగంతో ట్రాఫిక్‌కు కాసేపు అంతరాయం కలిగింది. రోడ్లపై హల్‌చల్ చేసిన వారిని పోలీసులు చెదరగొట్టారు.సూరారం సర్కిల్‌లోనూ పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చారు. టీషర్టులు విప్పి రోడ్లపై రచ్చ చేయడంతో అక్కడా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. నిలిచిపోయిన వాహనాలపైకి ఎక్కి మరీ అభిమానులు చిందులేశారు. పలువురు వాహనదారులను ఇబ్బంది పెట్టారు. పోలీసులు రంగంలోకి దిగి వారిని తరిమికొట్టారు.




# ఎర్రగడ్డ ఆసుపత్రిలో కలుషితాహారం ఘటనపై ప్రభుత్వం సీరియస్

**హైదరాబాద్, స్టార్ త్రినేత్రం:**

ఎర్రగడ్డలోని మానసిక ఆరోగ్య కేంద్రంలో కలుషితాహారం ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ అయింది. ఆసుపత్రిలో ఆహార పదార్థాల సరఫరా కాంట్రాక్టర్ జైపాల్‌రెడ్డిని తొలగిస్తూ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదేశాలు జారీ చేశారు. ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రభుత్వం ఆర్ఎంవో డాక్టర్ పద్మజను సస్పెండ్ చేసింది. కలుషిత ఆహారం ఘటనలో ఒక రోగి మృతి చెందగా, 92 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిలో 18 మందిని మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.




డిశ్చార్జి కమిటీ (డీసీ) వార్డులో ఉంటున్న భూపాలపల్లికి చెందిన కరణ్ (30) అనే వ్యక్తి తీవ్ర అస్వస్థతతో మంగళవారం ఉదయం చనిపోవడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. ఉస్మానియా నుంచి ప్రత్యేక బృందాన్ని రప్పించి పర్యవేక్షిస్తున్నారు. మిగిలిన బాధితుల పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. సోమవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో ప్రత్యేకంగా చక్కెర పరమాన్నం చేశారు. దీంతోపాటు అన్నం, కూర, అరటి పండ్లు, గుడ్లను రోగులకు వడ్డించారు. సాయంత్రం డీసీ వార్డు, కోర్టు వార్డుల్లో మొత్తం 71 మంది రోగులకు వాంతులు, విరేచనాలు కావడంతో వైద్యాధికారులు వారికి చికిత్స అందించారు. డీసీ వార్డులో ఉన్న కరణ్ జ్వరం, ఇతర సమస్యలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఎర్రగడ్డ ఆసుపత్రిలో నల్లా నీటిని ఆర్వో ప్లాంట్లకు పంపి.. వాటి ద్వారా రోగులకు సరఫరా చేస్తున్నారు. స్టీలు బిందెల్లో పట్టిన ఆ నీటిని రోగులు గ్లాసులతో ముంచుకుని తాగుతుంటారని అధికారులు తెలిపారు. ఇలా తాగునీరు కలుషితమైందా అనే కోణంలోనూ పరిశీలిస్తున్నారు. ఈ సంఘటనకు కారణాలు తెలుసుకునేందుకు నమూనాలను పరీక్షలకు పంపామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత చెప్పారు.

# భాషా వివాద నేపథ్యం.. కమల్‌హాసన్ రాజ్యసభ నామినేషన్ వాయిదా

**ఇంటర్నెట్ డెస్క్:**

'థగ్ లైఫ్' సినిమా ఈవెంట్‌లో కన్నడ భాషపై మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత, ప్రముఖ నటుడు కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగిన సంగతి తెలిసిందే. ఈ భాషా వివాదం నేపథ్యంలో ఆయన రాజ్యసభ స్థానానికి నామినేషన్ దాఖలు చేయడాన్ని వాయిదా వేసుకున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. త్వరలో విడుదల కాబోయే తన చిత్రం 'థగ్ లైఫ్' వ్యవహారాలు పూర్తయిన తర్వాతే నామినేషన్ వేయాలని భావిస్తున్నట్లు తెలిపాయి. కమల్ 2018లో ఎంఎన్ఎం పార్టీని స్థాపించారు. విపక్ష ఇండియా కూటమిలో ఇది భాగం. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులో డీఎంకే, కాంగ్రెస్ కూటమికి మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒప్పందంలో భాగంగా రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలు, పుదుచ్చేరిలోని ఒక స్థానంలో ఎంఎన్ఎం ప్రచారం చేసింది. 2025 ఎగువసభ ఎన్నికల్లో ఎంఎన్ఎం పార్టీకి రాజ్యసభ స్థానం ఇచ్చేందుకు డీఎంకే నేతృత్వం లోని కూటమి అంగీకరించింది. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో డీఎంకేతో కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం ఎంఎన్ఎంకు ఎగువసభ స్థానం కేటాయించారు. దీంతో కమల్ హాసన్ రాజ్యసభకు వెళ్లనున్నారనే విషయాన్ని డీఎంకే-ఎంఎన్ఎం ఇటీవల ఖరారు చేశాయి.ఇటీవల నిర్వహించిన 'థగ్‌లైఫ్' సినిమా ఈవెంట్‌లో తమిళం నుంచే కన్నడ పుట్టిందని కమల్ వ్యాఖ్యానించడంతో భాషా వివాదం మొదలయ్యింది.



కమల్ వ్యాఖ్యలను కన్నడ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో కర్ణాటకలో థగ్‌లైఫ్ చిత్రాన్ని నిషేధించాలని కోరుతూ ఆ రాష్ట్ర ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (కేఎఫ్‌సీసీ) హైకోర్టును ఆశ్రయించింది. ఆ పిటిషన్‌ను మంగళవారం విచారించిన న్యాయస్థానం కమల్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. క్షమాపణ చెబితే అన్నీ పరిష్కారమయ్యేవని వ్యాఖ్యానించింది. దీంతో ఈ చిత్రాన్ని కర్ణాటకలో ప్రస్తుతానికి విడుదల చేయకూడదని కమల్‌హాసన్ నిర్ణయించారు. అనంతరం, తన వ్యాఖ్యలను అపార్థం చేసుకున్నారంటూ 'కేఎఫ్‌సీసీ'కి కమల్ లేఖ రాశారు. అయితే, అందులోనూ సారీ చెప్పకపోవడం గమనార్హం.

# గోవధ చట్టాన్ని కఠినంగా అమలు చెయ్యాలి: హయత్ నగర్ బీజేవైఎం అధ్యక్షులు ఎర్ర ప్రేమ్

**స్టార్ త్రినేత్రం, హయత్ నగర్:**

గోవధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని హయత్ నగర్ డివిజన్ బీజేవైఎం అధ్యక్షులు ఎర్ర ప్రేమ్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు బుధవారం హయత్ నగర్ సర్కిల్ సీఐ పల్స నాగరాజ్ గౌడ్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మల్కాజిగిరి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్ మాట్లాడుతూ.. బక్రీద్ పండగ సందర్భంగా ఎక్కడ కూడా గోవధ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, హయత్ నగర్ డివిజన్ నగర శివారులో ఉండడం మరియు సమీపంలో ఉన్నందువల్ల గతంలో అక్రమంగా తరలిస్తున్న చాలా గోవులను పట్టుకొని పోలీస్ శాఖ వారికి అప్పగించడం జరిగిందని, నగరంలో ప్రవేశించడానికి ప్రముఖ మార్గం కావడంతో డివిజన్ శివారులో ప్రత్యేకమైన చెక్ పోస్టులు ఏర్పాటు చేసి గోవుల తరలింపును అడ్డుకొని, ఎక్కడ కూడా గోవధ జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు సిఐని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీను, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్,నాయకులు ఎర్రవెలి సత్యనారాయణ, వస్పరి వెంకటేష్, పిట్టల మహేష్, నవీన్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు




# కేసీఆర్‌ను బద్నాం చేసేందుకే కాళేశ్వరం కమిషన్: ఎమ్మెల్సీ కవిత



**హైదరాబాద్, స్టార్ త్రినేత్రం:**

రాజకీయ దురుద్దేశంతోనే మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని భారాస ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. నోటీసులను నిరసిస్తూ ఇందిరా పార్క్ వద్ద తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కేసీఆర్ ఏం తప్పు చేశారని నోటీసులు ఇచ్చారని ప్రశ్నించారు. ఆయనకు ఇచ్చారంటే మొత్తం తెలంగాణకు ఇచ్చినట్లే అని పేర్కొన్నారు. తెలంగాణ భూములకు నీళ్లు ఇవ్వడమే కేసీఆర్ చేసిన తప్పా అని నిలదీశారు.

" అది కాళేశ్వరం కమిషన్ కాదు.. అది కాంగ్రెస్ కమిషన్, రాజకీయ కమిషన్. కాళేశ్వరం పూర్తయితే 35 శాతం తెలంగాణ భూభాగానికి నీళ్లు అందిస్తుంది. కేసీఆర్‌ది గట్టి గుండె కాబట్టి అంత పెద్ద ప్రాజెక్టు నిర్మించారు. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోంది. కేసీఆర్‌ను బద్నాం చేసేందుకే కాళేశ్వరం కమిషన్ వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డకు చిన్న చిన్న మరమ్మతులు కూడా చేయట్లేదు. తెలంగాణ నీళ్లను ఏపీ తరలించుకుపోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించట్లేదు. గోదావరి-పెన్నా అనుసంధానం పేరిట నీళ్ల తరలింపును అడ్డుకోవాలి. భాజపాలో ఉన్న తెలంగాణ బిడ్డ ఈటల రాజేందర్ కూడా మాట్లాడకపోవడం శోచనీయం. గోదావరి-బనకచర్లను ఆపే బాధ్యతను ఆయన తీసుకోవాలి. కాళేశ్వరానికి జాతీయ హోదా తీసుకొచ్చే బాధ్యతను కూడా ఈటల తీసుకోవాలి" అని కవిత అన్నారు.

# వారిని కించపరిచే హక్కు మీకు లేదు: రాహుల్‌పై హైకోర్టు మండిపాటు

**ఇంటర్నెట్ డెస్క్:**

కాంగ్రెస్ అగ్రనాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై అలహాబాద్ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. గతంలో భారత ఆర్మీని ఉద్దేశిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా రాహుల్‌కు చురకలు అంటించింది. మన సైన్యాన్ని కించపరిచేలా మాట్లాడే హక్కు లేదని పేర్కొంది. దేశంలో భారత జోడో యాత్ర చేపట్టిన రాహుల్ గాంధీ.. "దాదాపు 2 వేల చదరపు కిలోమీటర్ల భారత భూగాన్ని చైనా స్వాధీనం చేసుకుంది. కానీ, కేంద్రంలో అధికారంలో ఉన్న వారు దాని గురించి ఒక్క ప్రశ్న కూడా అడగరు. అరుణాచల్‌ప్రదేశ్‌లో 20 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. దీని గురించి దేశ మీడియా ప్రశ్నించడం లేదు. ఇది నిజం కాదా..? ఇదంతా యావత్ దేశం గమనిస్తోంది" అని రాహుల్ వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి.

దీంతో రాహుల్‌పై తీవ్ర విమర్శలు వెల్లు వెత్తాయి. దేశ సైన్యాన్ని అవమానించేలా మాట్లా డారని ఆరోపిస్తూ



అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై న్యాయస్థానం తాజా గా విచారణ చేపట్టింది. "భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 19(1)ఎ ప్రతి పౌరుడికి స్వేచ్ఛగా మాట్లాడే హక్కు కల్పించింది. అందులో ఎలాంటి సందేహం లేదు. కానీ, వాక్ స్వాతంత్ర్యానికి కొన్ని పరిమితులు ఉన్నాయి. దేశ సైనికులను కించపరిచే హక్కు ఎవరికీ లేదు" అని న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది.

# ప్రజా విప్లవానికి 'నియంత' కొట్టుకుపోయిన రోజు ఇది: సీఎం చంద్రబాబు


**అమరావతి, స్టార్ త్రినేత్రం**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన రోజు అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజా విప్లవానికి నియంత పాలకులు కొట్టుకుపోయిన రోజు అని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. "అధికారం పేరుతో ఊరేగిన ఉన్మాదాన్ని ప్రజలు తరిమికొట్టిన రోజు. సైకో పాలనకు అంతం పలికి.. ప్రతి పౌరుడూ స్వేచ్ఛ, ప్రశాంతత పొందిన రోజు. ఉద్యమంలా ఓట్లేసి తిరిగి రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టిన రోజు. ప్రభుత్వ ఉగ్రవాదంతో గాయపడ్డ రాష్ట్రాన్ని కూటమి చేతిలో పెట్టి సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు నాంది పలికిన రోజు. పసుపు సైనికుల పోరాటాలు, జనసైనికుల ఉద్యమాలు, కమలనాథుల మద్దతుతో రాష్ట్రం గెలిచిన రోజు. ఏడాది క్రితం ప్రజలు ఇచ్చిన అధికారాన్ని రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యతగా భావించి ప్రతి రోజూ పనిచేస్తున్నాం. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు పాలనను గాడిన పెట్టాం. సంక్షేమాన్ని అందిస్తూ అభివృద్ధిని పట్టాలెక్కించాం. రాష్ట్ర దశ, దిశను మార్చేందుకు ఇచ్చిన ఏకపక్ష తీర్పునకు ఏడాది పూర్తయిన సందర్భంగా నాటి విజయాన్ని గుర్తుచేసుకుంటూ ప్రజలకు శిరసు వంచి నమస్కారాలు తెలియజేస్తున్నాను. వచ్చే 4 ఏళ్లలో మరెన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని మాట ఇస్తున్నాం. విధ్వంస పాలకులపై రాజీలేని పోరాటంతో కూటమి విజయానికి నాంది పలికిన తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల కార్యకర్తలు, నాయకులకు అభినం దనలు.. ధన్యవాదాలు. జై ఆంధ్రప్రదేశ్.. జై జై ఆంధ్రప్రదేశ్!" అని చంద్రబాబు పేర్కొన్నారు.

# 'యువగళం' పాదయాత్రపై పుస్తకం.. పవన్‌కు అందజేసిన లోకేశ్

**అమరావతి, స్టార్ త్రినేత్రం**

'యువగళం' పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు మంత్రి నారా లోకేశ్ అందజేశారు. క్యాబినెట్ భేటీకి హాజరయ్యేందుకు సచివాలయానికి వచ్చిన పవన్‌ను లోకేశ్ కలిసి అందించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ నాటి రాక్షస పాలనపై ప్రజలను చైతన్యం చేయడంలో యువగళం పాదయాత్ర సఫలీకృతమైందన్నారు. నాటి అనుభవాలను కళ్లకు కట్టినట్లుగా పుస్తకరూపంలోకి తేవడంపై లోకేశ్‌ను ప్రశంసించారు. అరాచక పాలన అంతమై నేటికి ఏడాది పూర్తయిందని.. గత ప్రభుత్వ పీడకలను ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదన్నారు. పాదయాత్ర నాటి అనుభవాలను పవన్‌తో లోకేశ్ పంచుకున్నారు.



వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 8 | ఎడిటర్ : డీ.శివకృష్ణ | గురువారం, 05 జూన్ 2025 | పేజీలు : 4 | వెల : 2
WARANGAL 3 VOL-1 ISSUE-08 Editor: D.SHIVAKRISHNA THURSDAY 05 JUNE 2025 Pages:4 Price:2

## ఈతకు వెళ్లిన ముగ్గురు యువకుల గల్లంతు

కామారెడ్డి,జూన్ 3 స్టార్ త్రినేత్రం : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం సోమార్ పేటలో విషాదం చోటుచేసుకుంది. సోమార్ పేట వద్ద నిజాం సాగర్ బ్యాక్ వాటర్ లో ఈతకు వెళ్ళి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. స్నేహితుల తో కలిసి ఈతకు వెళ్ళారు ఎల్లారెడ్డికి చెందిన యువకులు. గల్లంతైన యువకులు మధుకర్ గౌడ్, నవీన్, హర్ష వర్ధన్ గా గుర్తించారు. గల్లంతైన యువకుల కోసం గజ ఈత గాళ్ళత గాలింపు చేపట్టారు. రాత్రి చీకటిగా ఉండటంతో గాలింపుకు అంతరాయం ఏర్పడింది. నేడు ఉదయం మళ్ళీ గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. మృతదేహాల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. యువకులు గల్లంతు కావడంతో కుటు-ంబాల్లో తీవ్ర విషాదం చోటు-చేసుకుంది.

## ఎపిలో యోగాంధ్ర కార్యక్రమాలు భేష్

న్యూఢిల్లీ,జూన్ 3 స్టార్ త్రినేత్రం : అంతర్జాతీయయోగా దినోత్సవాన్నిపురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లో యోగా కార్యక్రమాలు జరుగుతున్న తీరుపట్ల ప్రధాని మోడీ ఆనందం వ్యక్తం చేశారు. నెలరోజులపాటు చేపడతున్న కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయని అన్నారు. యోగాంధ్ర దినోత్సవం పట్ల ప్రజల్లో ఉత్సాహాన్ని చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీఅన్నారు. యోగాంధ్ర 2025 పేరిట యోగాకు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు ఆంధప్రదేశ్ ప్రజలు చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. జూన్ 21న ఏపీలో యోగా దినోత్సవం జరుపుకొనేందుకు ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నట్లు- పేర్కొన్నారు. జూన్ 21న విశాఖలో 5 లక్షల మందితో ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. విశాఖలో జరిగే యోగా ఈవెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొననున్నారు.అందరూ యోగా దినోత్సవంలో పాల్గొనాలని, యోగాను నిత్య జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. యోగాంధ్రలో భాగంగా చిత్తూరు సమీపంలోని పులిగుండు ట్విన్‌హిల్స్‌లో దాదాపు 2వేల మందికి పైగా ఔత్సాహికులు యోగాసనాలు వేస్తున్న ఫొటోలను కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ 'ఎక్స్'లో షేర్ చేయగా.. ఆ ట్వీట్‌ను ప్రధాని రీట్వీట్ చేశారు. జీవన శైలిలో భాగమయ్యేలా యోగాను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఏపీ ప్రభుత్వం యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన విషయం తెలిసిందే. మే 21 నుంచి జూన్ 21 వరకు కూటమి ప్రభుత్వం గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో యోగాపై అవగాహన కల్పిస్తోంది. కనీసం 2 కోట్ల మందికి తక్కువ కాకుండా పాల్గొనాలన్నది సంకల్పంగా పెట్టుకోగా.. 10 లక్షల మందికిపైగా యోగా సర్టిఫికెట్లు- ఇవ్వాలనేది లక్ష్యంగా పెట్టుకుంది.

## రాయికల్ తహసిల్దార్ కార్యాలయంలో ఎసిబి దాడులు

జగిత్యాల,జూన్ 3 స్టార్ త్రినేత్రం : జగిత్యాల జిల్లా రాయికల్ తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం ఎసిబి అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి తహసిల్దార్ గణేష్‌తో పాటు మధ్యవర్తిగా వ్యవహరించిన ప్రవేటు డాక్యుమెంట్ రైటర్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని సింగరావుపేట గ్రామానికి చెందిన ఓ రైతు తన వ్యవసాయ భూమిని రిజిస్ట్రేషన్ చేయించు కోవడానికి ఇన్‌ఛార్జి తహసిల్దార్ గణేశ్‌ను సంప్రదించాడు. ఇందుకు ఆయన రూ. 15 వేలు లంచం కావాలని డిమాండ్ చేశాడు. రాయికల్ పట్టణానికి చెందిన ప్రవేటు- డాక్యుమెంట్ రైటర్ ముజాఫర్ ఇందులో మధ్యవర్తిగా వ్యవరించి రూ.10 వేలకు ఒప్పందం కుదిర్చాడు. ఈ క్రమంలో బాధిత రైతు ఎసిబిని సంప్రదించాడు. కరీంనగర్ ఎసిబి డిఎస్‌పి విజయ్‌కుమార్ తహసిల్దార్ కార్యాలయంపై మంగళవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. మధ్యవర్తిగా వ్యవహరించిన ముజాఫర్, రూ.10 వేల లంచం తీసుకుంటు-న్న ఇన్‌ఛార్జి తహసిల్దార్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. కాగా, వారిద్దర్నీ రిమాండ్‌కి తరలించినట్లు- ఎసిబి డిఎస్‌పి విజయ్‌కుమార్ వెల్లడించారు.

## సోషల్ మీడియా ప్రొఫైల్ ఉండాల్సిందే

వాషింగ్టన్,జూన 3 స్టార్ త్రినేత్రం : హార్వర్డ్ యూనివర్సిటీలో అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకునే విదేశీయుల సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తామని అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో ఇటీవల తెలిపారు. ఈ మేరకు మార్గదర్శకాలను వివిధ దేశాల్లోని అమెరికా ఎంబసీలకు పంపించారు. సోషల్ మీడియాలో లేని వారు, తమ అకౌంట్‌లను బయటి వారు చూడకుండా ఆంక్షలు పెట్టేవారి వీసా దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. అంటే, సోషల్ మీడియాలో లేని దరఖాస్తుదారులను కాన్సులార్ అధికారులు అనుమానాస్పదులుగా, తప్పించుకుని తిరిగే వారిగా భావించే ప్రమాదం ఉందని పరిశీలకులు అంటున్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు, కాంట్రాక్టర్‌లు, గెస్ట్ స్పీకర్లు, టూరిస్టులు.. ఇలా హార్వర్డ్‌ను సందర్శించాలనుకునే వారందరికీ తాజా నిబంధన వర్తిస్తుందని మంత్రి రూబియో తెలిపారు. విదేశీయుల విషయంలో అమెరికా నిబంధనలు మరింత కఠినం చేయనుందనే దానికి సంకేతంగా తాజాగా రూల్స్‌ను భావించాలని పరిశీలకులు చెబుతున్నారు. వీసా ఇంటర్వ్యూలకు సంబంధించి భద్రతా ప్రమాణాల పునఃపరిశీలన కోసం ఉద్దేశించిన పైలట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ నిబంధనలను అమెరికా రూపొందించింది. ఈ నిబంధనలపై న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త విధానంతో ఎవరికీ ప్రయోజనం ఉండదని చెబుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేక కం-టె-ంట్ పోస్టు చేయడంతో పాటు- ఆన్‌లైన్‌లో యాక్టివ్‌గా లేకపోయినా అభ్యర్థులు మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. వ్యక్తిగత గోప్యత, భావప్రకటనా స్వేచ్ఛ హద్దులను అతిక్రమించేలా తాజా నిబంధనలు ఉన్నాయని విమర్శిస్తున్నారు.

## మెట్ల మార్గంలో టోకెన్ సెంటర్ మార్పు

తిరుమల,జూన్3 స్టార్ త్రినేత్రం : కలియుగ ప్రత్యక్షదైవమైన తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి నిత్యం వేలాదిమంది భక్తులు తరలివస్తుంటారు. కొంతమంది భక్తులు నడకమార్గం ద్వారా తిరుమలకు చేరుకుని శ్రీవారి దర్శనం చేసుకుంటూ ఉంటారు. అలిపిరి నడక మార్గం నుంచే కాకుండా శ్రీవారి మెట్టు నుంచి కూడా తిరుమలకు చేరుకునే అవకాశం ఉంది. అలిపిరి నడకమార్గంతో పోలిస్తే శ్రీవారిమెట్టు- మార్గం మెట్లు- తక్కువగా ఉండటంతో కొంతమంది భక్తులు అక్కడి నుంచి తిరుమలకు వెళ్లడానికి ప్రాధాన్యం ఇస్తుంటారు.ఇక తిరుమలకు కాలినడకన వెళ్లేవారికి టీటీడీ దివ్య దర్శనం టోకెన్లు జారీ చేస్తుంది. అలిపిరి, శ్రీవారి మెట్టు- మార్గాల వద్ద శ్రీవారి దివ్య దర్శనం టైమ్ స్లాట్ టోకెన్లు జారీ చేస్తోంది. అయితే.. శ్రీవారి మెట్ల వద్ద నడక మార్గంలో జారి చేసే టోకెన్ల కౌంటర్ ని తాత్కాలికంగా మార్పు చేసినట్లు టీటీడీ పేర్కొంది. శుక్రవారం నుంచి అలిపిరి వద్ద ఉన్న భూదేవి కాంప్లెక్స్ వద్ద దర్శన టోకెన్లు జారీ చేయాలని నిర్ణయించింది. ఈ మార్పు తాత్కాలికమే అని టీటీడీ ప్రకటించింది.

## ఆర్మీ జవాన్‌కు లోకేష్ అండ

### భూకబ్జా సమస్య పరిష్కారం

అమరావతి,జూన్ 3 స్టార్ త్రినేత్రం :దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడే ఆర్మీ జవాన్ కు మంత్రి నారా లోకేష్ అండగా నిలిచారు. సత్యసాయి జిల్లా అమరాపురం మండలం కె.శివరంలో తన భార్య తల్లిదండ్రులకు చెందిన రెండెకరాల భూమిని కబ్జా చేశారంటూ రాష్ట్రానికి చెందిన బీఎస్ఎఫ్ జవాన్ డి.నరసింహమూర్తి జమ్మూకశ్మీర్ నుంచి సెల్ఫీ వీడియో విడుదల చేశారు.. అమరాపురం మండలం ఉదుకూరుకు చెందిన నరసింహమూర్తి దేశ సరిహద్దుల్లో జవాన్ గా విధులు నిర్వహిస్తున్నారు. వైసీపీ హయాంలో ఫీల్డ్ అసిస్టెంట్ గా పనిచేసిన నాగరాజు అనే వ్యక్తి తమ భూమిని కబ్జా చేశారని, విచారించి తగిన న్యాయం చేయాలంటూ సెల్ఫీ వీడియో ద్వారా మంత్రి నారా లోకేష్ ను జవాన్ విజ్ఞప్తి చేశారు. సదరు వీడియోపై తక్షణమే స్పందించిన మంత్రి నారా లోకేష్.. భూ సమస్యను పరిష్కరిం చాలంటూ అధికారులను ఆదేశించారు.

## రామేశ్వరంనకు ప్రత్యేక రైలు

హైదరాబాద్,జూన్ 3 స్టార్ త్రినేత్రం : తమిళనాడులో ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామేశ్వరం వెళ్లే ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. చర్లపల్లి - రామనాథపురం మధ్య ప్రత్యేక రైళ్లను నడిపించనున్నట్లు- పేర్కొంది. చర్లపల్లి-రామనాథపురం (07695) రైలు ఈ నెల 11 నుంచి 25 వరకు ప్రతి బుధవారం రాకపోకలు సాగిస్తుందని చెప్పింది. అలాగే, రామనాథపురం నుంచి చర్లపల్లి (07696) రైలు ఈ నెల 13 నుంచి 27 వరకు ప్రతి శుక్రవారం రైలు అందుబాటులో ఉంటుందని పేర్కొంది. రైలు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, చెన్నై ఎగ్మోర్, చెంగల్పట్టు-, విల్లుపురం, చిదంబరం, సిర్కాజీ, మయిలదుతురై, తిరువూర్, తిరుతురైపూండి, అదిరంపట్టణం, పుదుకొట్టై అర్ణతాంగి, కారైకుడి, శివగంగ, మానమాదురై స్టేషన్లలో రైలు ఆగుతుందని పేర్కొంది. రైలులో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉన్నాయని వివరించింది.

# అమెరికాలో ఇబ్బంది పడితే చెప్పండి

- వారికి బిఆర్ఎస్ అండగా నిలుస్తుంది
- అవసరమైన పక్షంలో న్యాయసహాయం కూడా అందిస్తాం
- అమెరికా చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాల్సిందే
- మంచి మార్పు దిశగా విద్యార్థులు కృషి చేయాలి
- డాలస్ పర్యటనలో విద్యార్థులతో కెటిఆర్




హైదరాబాద్,జూన్3 స్టార్ త్రినేత్రం : అమెరికాలో వివిధ కారణాలతో ఇబ్బందులు పడే భారతీయ విద్యార్థులకు అండగా నిలబడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నో ఆశలతో ఉన్నత విద్య కోసం వచ్చిన విద్యార్థులు, అవగాహన లేక ఏమైనా తప్పు చేస్తే వారికి అవసరమైన న్యాయసహాయం అందించేందుకు బీఆర్ఎస్ అమెరికా విభాగం తరపున ప్రయత్నం చేస్తామని తెలిపారు. అమెరికా వచ్చిన విద్యార్థులు ఏదైనా కారణంతో తిరిగి వస్తే అతనితోపాటు వారి కుటుంబం ఎంతో ఆవేదనకు గురవుతుందన్నారు చెప్పారు. అందుకే విద్యార్థులకు అండగా నిలబడేందుకు నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. అయితే విద్యార్థులు కూడా అమెరికా చట్టాలను, అక్కడి సమాజంలో వస్తున్న మార్పులను అర్థం చేసుకొని మసులుకోవాలని సూచించారు. స్థానిక చట్టాలతో పాటు- ఇక్కడి పరిస్థితులను ప్రతీ ఒక్క విద్యార్థి అవగాహన చేసుకోవాలన్నారు. అమెరికాలోని డాలస్ పర్యటనలో ఉన్న కేటీఆర్.. యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ డల్లాస్‌లో చదువుకుంటున్న విద్యార్థులతో మాట్లాడారు. వర్సిటీ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కేవలం ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా సమాజంలో, ప్రపంచంలో మంచి మార్పు తీసుకువచ్చే దిశగా ప్రయత్నం చేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రపంచవ్యాప్తంగా గొప్ప ఆవిష్కరణలు వస్తున్నాయన్న కేటీఆర్, ఇన్నోవేషన్ రంగంలో ప్రపంచ దేశాలతో భారత్ పోటీపడి రాణించాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికాలోని ఉన్నత విద్యా సంస్థల్లో చదువుతున్న భారతీయ విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. రిస్కు తీసుకున్నప్పుడు మాత్రమే కలలు సాకారం అవుతాయి అనడానికి కేసీఆర్ జీవితమే సాక్ష్యమని చెప్పారు. అమెరికా పోవాలన్నా, చదువు కోవాలన్నా ఎన్నో వ్యయ ప్రయాసలకు గురయ్యే వాళ్లమన్న కేటీఆర్.. ప్రపంచం వేగంగా మారిపోయి ఇప్పుడు అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. దాంతోపాటే అమెరికా విద్య కూడా అనేక మందికి అందుబాటులోకి వచ్చిందన్నారు. కేవలం ర్యాంకుల కోసమో, గ్రేడ్ల కోసమో కాకుండా జీవితంలో సాధించాల్సిన ప్రధాన లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. చూస్తుండగానే మనిషి జీవితంలో 50 ఏండ్లు పూర్తవుతాయని ఇంత స్వల్ప కాలంలోనే తమ కలలు, ఆకాంక్షలను అందిపుచ్చుకోవాలన్నారు. లక్ష్యం వైపు సాగే క్రమంలో అవరోధాలు ఎదురైనా, మనతోనే ఉన్న వ్యక్తులు వెనక్కి లాగినా నిబద్ధతతో ముందుకు పోవాలని చెప్పారు. రాజకీయాల్లో చిన్న వయసుగా పరిగణించే నాలుగు పదుల వయసులో పదవులను త్యాగం చేశారని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు- కోసం ఉద్యమం మొదలుపెట్టిన రోజు అనేకమంది ఆయనను అవహేళన చేశారని తెలిపారు. కానీ 14 సంవత్సరాల నిరంతర పోరాటం తర్వాత ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నప్పుడు సమాజంలోని ప్రతి ఒక్కరు కేసీఆర్‌పై ప్రశంసల కురిపించారని చెప్పారు. అమెరికాలో చదువుకుని ఇండియాకి తిరిగి వచ్చి కంపెనీలు ప్రారంభించాలని విద్యార్థులను కోరారు. మనదేశంలో ఎన్నో సవాళ్లు ఉన్నప్పటికీ అనేక అవకాశాలు కూడా ఉన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. మేథోవలస (ఇసశ ఉసశ) మన దేశానికి పెను సవాలుగా మారిందని చెప్పారు. దేశాభివృద్ధిలో, తెలంగాణ అభివృద్ధిలో విదేశాల్లో చదువుకుంటున్న యువత భాగం కావాలని పిలుపునిచ్చారు. ఇకపోతే అక్కడ తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. దీనిలో భాగంగా డాలస్‌లో అమెరికాలోనే అతి పెద్దదైన మహాత్మాగాంధీ విగ్రహాన్ని సందర్శించారు. అక్కడ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ అహింస, సత్యాగ్రహమే ఆయుధాలుగా భారతీయులందరినీ గాంధీ సమాయత్తం చేశారన్నారు. బ్రిటిష్ బానిస సంకెళ్ల నుంచి దేశాన్ని విడిపించి స్వాతంత్యం తీసుకొచ్చేందుకు కృషి చేశారని కొనియాడారు. అందుకే ప్రపంచ వ్యాప్తంగా నేటికీ గాంధీని ప్రశంసిస్తూనే ఉంటారని చెప్పారు. అలాంటి విశ్వనాయకుడి విగ్రహాన్ని ఇంత పెద్ద ఎత్తున డాలస్‌లో నెలకొల్పడంలో మహాత్మాగాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్ వ్యవస్థాపక అధ్యక్షులు డా.ప్రసాద్ తోటకూర, కార్యవర్గ సభ్యుల కృషిని కేటీఆర్ అభినందించారు. అనంతరం ఆ సంఘం వ్యవస్థాపక కార్యదర్శి రావు కల్వాల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు, దశాబ్దకాలం పాటు రాష్ట్ర అభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, వారి కుటుంబసభ్యులు చేసిన కృషి, త్యాగాలను రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మరువలేరని చెప్పారు. గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం కేసీఆర్ మార్గనిర్దేశరలో కేటీఆర్ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. కేసీఆర్ విజన్ తెలంగాణకు ఒక గళాన్ని ఇచ్చిందన్నారు. డా.ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ అమెరికాలో అతి పెద్దదైన గాంధీ స్మారకస్థలిని నిర్మించి 10 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఈ నిర్మాణం ప్రవాస భారతీయుల సమష్టి కృషి, ఐకమత్యానికి నిదర్శనమని చెప్పారు. దీన్ని సాకారం చేసేందుకు అనుమతులు ఇచ్చిన నగర అధికారులు, దాతలు, కార్యవర్గ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా డాలస్ సందర్శనకు వచ్చినవారు ఈ గాంధీ స్మారకస్థలిని సందర్శిస్తూనే ఉన్నారని చెప్పారు. అనంతరం కేటీ-ఆర్‌ను బోర్డు సభ్యులు రావు కల్వాల, బీఎన్ రావు, తైయాబ్ కుండావాలా, మురళి వెన్నం, రాజేంద్ర వంకావాలా, అనంత్ మల్లవరపు, వినోద్ ఉప్పు, షబ్నం మాడ్గిల్‌తో కలిసి డా.ప్రసాద్ తోటకూర ఘనంగా సన్మానించారు. వందలాది ప్రవాస భారతీయులు హాజరయ్యారు.

# యువజంట హనీమూన్ విషాదం

- వధువు ఆచూకీ మిస్టరీ..వరుడి మృతదేహం లభ్యం
- ఘటనపై సిబిఐ విచారణకు డిమాండ్

న్యూఢిల్లీ,జూన 3 స్టార్ త్రినేత్రం : గత నెల 20న హనీమూన్ కోసం మేఘాలయ వెళ్లిన ఓ జంట అదృశ్యమైన ఘటనలో విషాదం నెలకొంది. జంటలో కొత్త పెళ్లి కొడుకు మృతదేహం కుళ్లిన స్థితిలో కనుగొన్నారు. అతడి చేతిపై ఉన్న టాటూతో గుర్తించారు. ఈ ఘటనపై సిబిఐ విచారణకు కటుఉంబ సభ్యులు డిమాండ్ చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన ఈ కొత్త జంట అదృశ్యమైన 11 రోజుల తర్వాత భర్త రాజా రఘువంశీ(29) మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. అతడి భార్య సోనమ్ ఆచూకీ కోసం గాలిస్తున్నారు. మే 23న సోహ్రా చిరపుంజిలోని ఈస్ట్ కాశీ హిల్స్ జిల్లాలో ఈ జంట అదృశ్యమైన ఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే. నోంగ్రియాట్ గ్రామంలోని ఓ అతిథిగృహం నుంచి బయటకు వెళ్లిన కొద్ది గంటల్లోనే వీరు అదృశ్యమైనట్లు అధికారులు తెలిపారు. అయితే, సోహ్రాలోని ఓ జలపాతం సమీపంలో లోతైన లోయలో సోమవారం రఘువంశీ మృతదేహాన్ని గుర్తించినట్లు వెల్లడించారు. నోంగ్రియాట్ గ్రామం నుంచి 20కి.మీల దూరంలో అతడి మృతదేహాన్ని గుర్తించి హత్య కేసుగా కేసు నమోదు చేసినట్లు- పోలీసులు తెలిపారు. దీనిపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌పోర్టు వ్యాపారి రాజా రఘువంశీ మృతిపై అతడి సోదరుడు సచిన్ రఘువంశీ ఇండోర్‌లో స్పందించాడు. నా సోదరుడి హత్య కేసు మిస్టరీని ఛేదించేందుకు సీబీఐతో దర్యాప్తు చేయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. నా సోదరుడిని కోల్పోయా.. కానీ, నా మరదలు సోనమ్‌ని పోగొట్టుకొనేందుకు సిద్ధంగా లేము. ఆమె ఎక్కడ ఉందో ప్రభుత్వం గుర్తించాలి. సెర్చ్ ఆపరేషన్‌లో సైన్యం సహాయం తీసుకోవాలని నేను మొదటి నుంచీ డిమాండ్ చేస్తున్నా. నా సోదరుడి మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండటంతో గుర్తించడం కష్టమైంది. కానీ, అతడి పేరును 'రాజా' అని చేతిపై టాటూ వేయించుకున్నాడు. మేఘాలయలో భారీ వర్షాలు కురుస్తుండటంతో నా వాటర్ ప్రూఫ్ స్మార్ట్‌వాచ్ పెట్టుకొని వెళ్లాడు. ఆ వాచ్ చేతికి ఉండటంతో అతడేనని గుర్తించడం సులువైందని చెప్పుకొచ్చాడు. నా సోదరుడి హత్య, అతడి భార్య అదృశ్యం కేసులో మేఘాలయలోని స్థానిక హోటల్- రెస్టరంట్ సిబ్బంది, గైడ్‌లు, ద్విచక్రవాహనాలు అద్దెకు ఇచ్చే వ్యక్తులపై అనుమానం ఉంది. వారిని పోలీసులు గట్టిగా విచారించాలని కోరారు. రాజా రఘువంశీ కుటుంబం మధ్యప్రదేశ్‌లోని ఇండొర్‌లో ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేస్తోంది. మే 11న అతడికి సోనమ్‌తో వివాహం జరగ్గా.. 20న హనీమూన్ కోసం ఈ నవ దంపతులు మేఘాలయకు వెళ్లారు. అయితే, ఈ జంట మే 22న ఓ ద్విచక్రవాహనాన్ని అద్దెకు తీసుకొని మౌలాకియాత్ అనే గ్రామానికి చేరుకున్నట్లు- మేఘాలయ అధికారులు తెలిపారు. ద్విచక్రవాహనాన్ని అక్కడ పార్క్ చేసి అక్కడే ఉన్న ప్రసిద్ధిగాంచిన 'లివింగ్ రూట్ వంతెన'ను చూసేందుకు వెళ్లారని తెలిపారు. రాత్రి అక్కడ బస చేసి.. మర్నాడు ఉదయం బయటకు వెళ్లారని వివరించారు. ఈ జంట ప్రయాణించిన ద్విచక్రవాహనాన్ని మే 24న షిల్లాంగ్ - సోహ్రా రోడ్డులో ఓ కేఫ్ వద్ద గుర్తించినట్లు- పోలీసులు వెల్లడించారు. అనంతరం గ్రామస్థుల సహకారంతో గాలింపు చర్యలు కొనసాగించినట్లు చెప్పారు.

# దళిత విద్యార్థుల పేరుతో లూటీ

- ఎస్ ప్రవీణ్ కుమార్‌పై కాగ్ నివేదిక
- ఈ వ్యవహారంపై విజిలెన్స్ విచారణ చేయాలి
- పీసీసీ అధికార ప్రతినిధి సామా రామ్మోహన్ రెడ్డి

హైదరాబాద్,జూన్ 3 స్టార్ త్రినేత్రం : తెలంగాణలో రాజకీయ వాతావరణం మరోసారి వేడెక్కింది. పీసీసీ అధికార ప్రతినిధి సామా రామ్మోహన్ రెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌పై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆర్ఎస్ ప్రవీణ్ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. దళిత విద్యార్థుల సంక్షేమ పథకాల పేరుతో నిధులను పక్కదారి మళ్లించారని ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దళిత పిల్లల పేర్ల మీద వారికి అందాల్సిన సంక్షేమ పథకాలను ఈ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ లూటీ చేశారని ఆరోపించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు చెప్పి...ఆయన రాసిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 240 మంది విద్యార్థులకు కోడింగ్ నేర్పించడానికి ఏకంగా నాలుగు కోట్లు- ఖర్చు చేశారని చెబుతున్నారని, ఇది నమ్మదగిన విషయం కాదన్నా సామా రామ్మోహన్ రెడ్డి. మూడు సంస్థల పేరుతో కోడింగ్ శిక్షణ చేపడతామన్నా, కేవలం రెండు సంస్థలకే అనుమతులు తీసుకున్నారు అంటూ మండిపడ్డారు. ఈ--టెండర్ పక్రియ చేపట్టకుండా కోర్సులకు ఖర్చులు చేసినట్టు రామ్మోహన్ ఆరోపించారు. ఐఐటీ-, జేఈఈ ఆన్‌లైన్ కోర్సుల పేరుతో రూ. 20 కోట్లు ఖర్చు చేశారు. ఆర్థిక శాఖ అనుమతి లేకుండా నిధులు విడుదలయ్యాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కూడా లక్షా ఇరవై వేల మందికి ఉచితంగా కోడింగ్ శిక్షణ ఇస్తున్నామని, ఇది ప్రభుత్వం చేపట్టిన పారదర్శక కార్యక్రమమని వివరించారు. ఈ ఆరోపణలన్నీ కేంద్రం కాగ్ నివేదికలో పేర్కొన్న విషయాలేనని తెలిపారు. దళిత విద్యార్థుల పేరుతో భారీగా నిధులు మళ్లించారని, అంబేద్కర్ పేరు చెప్పుకుంటూ, ఆయన రాసిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారని ఆయన ధ్వజమెత్తారు. ప్రభుత్వమే విజిలెన్స్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇతర అంశాలపై కూడా ఆయన స్పందించారు. గత పదకొండు ఏళ్లలో ఎస్సీ గురుకులాల్లో 100 శాతం ఆక్యుపెన్సీ సాధించలేకపోయారని, ప్రస్తుతం మాత్రం అన్ని సీట్లు భర్తీ అవుతున్నాయని తెలిపారు. యూనిఫాం, దుప్పట్ల వంటి అవసరమైన సదుపాయాలనూ మరవకుండా ప్రవీణ్ వదిలి పెట్టలేదని విమర్శించారు. కంఎ÷-ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికలో కేంద్రం పొందు పరిచిన అంశాలనే తాము బయట పెడుతున్నామన్నారు. కోడింగ్ విధానంపై ఏడాదికి రూ. 4 కోట్లు- ఖర్చు చేశారని వివరించారు. 240 మంది పిల్లలకు కోడింగ్ చేస్తే రూ. 4 కోట్లు అవుతాయా..? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. మూడు సంస్థల పేరుతో కోడింగ్ నేర్పిస్తానంటూ రెండు సంస్థల నుంచే అనుమతి తీసుకున్నారని గుర్తు చేశారు. దీనికి ఆర్థిక శాఖ అనుమతి కూడా లేదన్నారు. దీనిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఐఐటీ-.. జేఈఈ ఆన్‌లైన్ కోర్స్‌కి రూ.20 కోట్లు- ఖర్చు పెట్టారని.. దీనికి -టెండర్ లేదు.. ఆర్థిక శాఖ అనుమతి సైతం లేదని వివరించారు. ఇప్పుడు కూడా లక్ష 20 వేల మందికి కోడింగ్‌కి తమ ప్రభుత్వం శిక్షణ ఇస్తుందని చెప్పారు. అదీ కూడా తమ ప్రభుత్వం నేర్పిస్తుందని చెప్పారు. ఆర్ ఎస్ ప్రవీణ్ ఫ్రాడ్‌పై ప్రభుతాన్ని కాగ్ నివేదిక కోరిందన్నారు. అదే విధంగా సమ్మర్ క్యాంప్‌ల పేరు మీద కూడా నిధులు పక్కదారి పట్టించారని పేర్కొన్నారు.

# తెలంగాణ నేతన్నకు భరోసా పథకం

- రూ. 48.00 కోట్లు కేటాయింపు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

హైదరాబాద్, జూన్ 3 స్టార్ త్రినేత్రం : నేత కార్మికుల సంక్షేమానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులోభాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన తెలంగాణ చేనేత అభయహస్తంలో భాగంగా తెలంగాణ నేతన్నకు భరోసా పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేయడం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇందుకోసం బడ్జెట్ రూ. 48.00 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా జియో ట్యాగ్ చేయబడిన మగ్గాలపై పనిచేస్తున్న కార్మికులకు మరియు అనుబంధ కార్మికులకు వేతన ప్రోత్సాహకం కింద గరిష్టంగా సంవత్సరానికి నేత కార్మికులకు రూ. 18,000 , అనుబంధ కార్మికులకు రూ. 6,000 అందించడం జరుగుతుందన్నారు. దీంతో దాదాపు 40,000 మంది చేనేత మరియు అనుబంధ కార్మికులు లబ్ధి పొందుతారని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేకాకుండా చేనేత కార్మికులు తయారుచేసిన వస్త్రాలకు ప్రత్యేకంగా తయారుచేయబడిన యూనిక్ లోగోను జతచేయడం జరుగుతుందని, తద్వారా చేనేత ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలను మరియు నేత కార్మికుని వివరాలను వినియోగదారులు తెలుసుకోవచ్చు. దీంతో తెలంగాణ చేనేత ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ పెరిగే అవకాశాలు ఏర్పడతాయని మంత్రిగారు తెలియజేశారు. ఈ పథకం నేత మరియు అనుబంధ కార్మికులందరికీ వర్తిస్తుంది. 18 సంవత్సరాలు నిండి జియో ట్యాగ్ చేయబడిన మరమగ్గాలపై పనిచేసే కార్మికులు మరియు ప్రీలూమ్, ప్రిపరేటరి పనులైన డైయింగ్, - టైయింగ్, డిజైనింగ్, వార్పింగ్, వైండింగ్, సైజింగ్ మొదలైన అనుబంధ పనులు చేసే కార్మికులు, చేనేత వృత్తి ద్వారా వారి వార్షిక ఆదాయంలో కనీసం 50 శాతం పొందుతున్నవారు అర్హులు. ఈ పథకం కింద జియో ట్యాగ్ చేయబడిన మగ్గాల ద్వారా వార్పులలో కనీసం 50 శాతం కంటే ఎక్కువ పూర్తి చేసిన నేత మరియు అనుబంధ కార్మికులకు నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలోకి వేతన ప్రోత్సాహకం కింద సంవత్సరానికి రెండు విడతలుగా ఏప్రిల్ నుండి సెప్టెంబర్ మరియు అక్టోబర్ నుండి మార్చి నేత కార్మికునికి రూ. 9,000, అనుబంధ కార్మికునికి రూ. 3,000 జమ చేయడం జరుగుతుంది. అయితే మొదటి విడతలో 50 శాతం వార్పులు పూర్తి చేయని వారు, రెండో విడతలో పూర్తి చేసినట్లతే మొత్తం ప్రోత్సాహకం సంవత్సరాంతంలో చేనేత మరియు అనుబంధ కార్మికులకు అందించబడుతుందని మంత్రి తెలిపారు.


# లష్కరే ముసుగుకు చైనా రక్షణ

### చైనా అండతోనే టిఆర్ఎఫ్ పేరు తప్పింపు
### అఖిలపక్ష దౌత్య బృందం సభ్యుడు శశిథరూర్

న్యూఢిల్లీ, జూన్ 3 స్టార్ త్రినేత్రం : జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి వెనుక ఉన్న లష్కరే తొయిబా ముసుగు సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ను చైనా కాపాడుతోందని అఖిలపక్ష దౌత్య బృందం సభ్యుడు శశిథరూర్ మండిపడ్డారు. పాకిస్థాన్ ప్రభుత్వం చైనా అండతో ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి లోనూ, ప్రెస్‌నోట్‌లోను టీఆర్ఎఫ్ పేరును తప్పించిందని అన్నారు. బ్రెజిల్ దౌత్యవేత్త, బ్రెజిల్ అధ్యక్షుడు ప్రధాన సలహాదారులు సెల్సో అమోరిమ్‌తో జరిపిన సమావేశంలో థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. యూఎన్ ఆంక్షల కమిటీ-కి టీ-ఆర్ఎఫ్‌కు సంబంధించిన సాక్ష్యాలను పలుమార్లు సమర్పించామని, ప్రతి సందర్భంలోనూ తన మిత్రదేశం పాకిస్థాన్‌కు అండగా నిలుస్తూ టీ-ఆర్ఎఫ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా అడ్డుకుంటోందని శశిథరూర్ వివరించారు. లష్కరే తొయిబా ఏర్పాటు- చేసిన టీఆర్ఎఫ్ పహల్గాం ఉగ్రదాడి జరిగిన మరుసటి రోజే దాడికి తామే బాధ్యులమని ప్రకటించిందని, అయితే ఇందువల్ల తలెత్తే పరిణామాల గుర్తించి పాక్‌లోని సోషల్ మీడియా హ్యాండిలర్స్ దానిని డిలీట్ చేశారని చెప్పారు. యూఎన్ఎస్‌సీ ప్రెస్‌మీట్‌లోనూ టీ-ఆర్ఎఫ్ ప్రస్తావన చేర్చాలని ఇండియా పదేపదే కోరినప్పటికీ పాకిస్థాన్ ప్రభుత్వం చైనాలోని తమ మిత్రుల అండతో ఆ పేరును తప్పించిందని, కనీసం దాని ప్రస్తావన కూడా లేదని వివరించారు. ఈ పద్ధతి మారాలంటే భద్రతా మండలిలో భారత్, బ్రెజిల్ ఉండాలన్నారు.

వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 8 | ఎడిటర్ : డీ.శివకృష్ణ | గురువారం, 05 జూన్ 2025 | పేజీలు : 4 | వెల : 2
WARANGAL 4 | VOL-1 | ISSUE-08 | Editor: D.SHIVAKRISHNA | THURSDAY 05 JUNE 2025 | Pages:4 | Price:2

# 'హరిహర వీరమల్లు' పారితోషికం తిరిగి ఇచ్చిన పవన్‌కల్యాణ్



ఏపీ డిప్యూటీ సీఎం, అగ్ర కథానాయకుడు పవన్‌కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయన కీలక పాత్రలో నటించిన హిస్టారికల్ యాక్షన్ మూవీ 'హరిహర వీరమల్లు'. ఈ చిత్రం కోసం పవన్ తీసుకున్న పారితోషికాన్ని తిరిగి ఇచ్చేస్తున్నట్లు తాజాగా ప్రకటించారు. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని ఏఎం రత్నం నిర్మించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న 'హరిహర వీరమల్లు' జూన్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది.

2020లో అధికారికంగా ఈ సినిమా మొదలు కాగా, సుదీర్ఘ కాలం సెట్స్‌పైనే ఉండిపోయింది. క్రిష్ దర్శకత్వంలో చాలా భాగం షూటింగ్ పూర్తి చేసుకుంది. పవన్‌కల్యాణ్ రాజకీయంగా బిజీ కావడంతో సినిమా మరింత ఆలస్యమవుతూ వచ్చింది. గతేడాది జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయం సాధించడంతో పవన్ ఏపీ డిప్యూటీ సీఎం అయ్యారు. అప్పటి నుంచి ప్రజా సేవకే ప్రథమ ప్రాధాన్యం ఇచ్చారు. అలా మరికొన్ని నెలల పాటు షూటింగ్ వాయిదా పడింది. ఎట్టకేలకు ఇటీవలే ఏఎం రత్నం తనయుడు జ్యోతికృష్ణ దర్శకత్వంలో చిత్రీకరణ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకొంటోంది.

ఇన్నేళ్ల పాటు సినిమా సెట్స్‌పైనే ఉండటం, నిర్మాత ఏఎం రత్నంపై ఆర్థికంగా అదనపు భారం పడింది. ఈ విషయాలను తెలుసుకున్న పవన్‌కల్యాణ్ తాను అడ్వాన్స్‌గా తీసుకున్న పారితోషికం మొత్తాన్ని తిరిగి ఇచ్చేశారు. నిర్మాతల గురించి ఆలోచించే నటుల్లో పవన్ కల్యాణ్ ముందుంటారని మరోసారి నిరూపించారు.

# రానా నాయుడి కుటుంబాన్ని ఎవరూ విడదీయలేరు!





''ప్రపంచంలో రానా నాయుణ్ని ఢీకొట్టగల ఒకే వ్యక్తి అతని తండ్రి మాత్రమే'' అంటున్నారు అగ్ర కథానాయకుడు వెంకటేశ్. ప్రస్తుతం ఆయన, కథానాయకుడు రానా ప్రధాన పాత్రల్లో నటించిన సిరీస్ 'రానా నాయుడు సీజన్ 2'. గతంలో విడుదలై యువతను విశేషంగా ఆకట్టుకున్న 'రానా నాయుడు' సిరీస్‌కు సీక్వెల్‌గా రూపొందింది. యాక్షన్, క్రైమ్ డ్రామా నేపథ్యంలో కరణ్ అన్షుమాన్, సుపర్ణ్ వర్మ రూపొందించారు. సుందర్ ఆరోన్ నిర్మించారు. తాజాగా ఈ సిరీస్ ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది సిరీస్ బృందం. ''తనను ఎవరు సృష్టించారో ఎప్పటికీ మర్చిపోనివాడే నిజమైన వ్యక్తి, నా కుటుంబమే నాకు సర్వస్వం.. ఒబెరాయిస్ గతాన్ని వెతికే ప్రక్రియలో నాయుడు భవిష్యత్తు మొత్తం బూడిద పాలయ్యే అవకాశం ఉంది, నువ్వు నాతో ఎప్పుడూ అంటుంటావు.. నేను ఈ కుటుంబాన్ని విడదీశానని.. కానీ బయట ఏమనుకుంటున్నారో తెలుసా? రానా నాయుడి కుటుంబాన్ని ఎవరూ విడదీయలేరని..'' లాంటి సంభాషణలతో సాగుతున్న ఈ ట్రైలర్ ఈసారి సినీ ప్రియులకు రెట్టింపు వినోదాన్ని పంచేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

ఇందులో అర్జున్ రాంపాల్, సుర్వీన్ చావ్లా, కృతి కర్బంద, సుశాంత్ సింగ్, అభిషేక్ బెనర్జీ, డినో మోరియా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 13 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఈ సిరీస్ తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రసారం కానుంది.

# అమ్మాయిలకు ఓ నమ్మకాన్నిచ్చే దేవిక అండ్ డానీ



''చాలా మంది అమ్మాయిలను చుట్టు పక్కల ఉండేవాళ్లు 'నువ్వు చేయలేవు.. సాధించలేవ'ని చెప్పి నిరుత్సాహపరుస్తుంటారు. అలాంటి అమ్మాయిలకు ఈ 'దేవిక అండ్ డానీ' వెబ్‌సిరీస్ ఓ నమ్మకాన్ని ఇస్తుంది'' అన్నారు నటి రీతూ వర్మ. ఇది ఆమె నటించిన తొలి వెబ్‌సిరీస్. 'శ్రీకారం' విజయంతో తొలి అడుగులోనే ప్రేక్షకుల్ని మెప్పించిన బి.కిశోర్ దీన్ని రూపొందించారు. సుధాకర్ చాగంటి నిర్మాత. సూర్య వశిష్ఠ, శివ కందుకూరి, సుబ్బరాజు తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ వెబ్‌సిరీస్ ఈ నెల 6న ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రీతూ వర్మ మాట్లాడుతూ.. ''వైవిధ్యభరితమైన కాన్సెప్ట్‌లు వస్తే వెబ్‌సిరీస్ చేయాలని నేనెప్పటి నుంచో అనుకుంటున్నా. ఈ క్రమంలోనే 'దేవిక అండ్ డానీ' లాంటి నిజాయతీతో కూడిన కథ నా దగ్గరకొచ్చింది. ఇందులో నటించడం నా అదృష్టంగా భావిస్తున్నా. దర్శకుడు కిశోర్ దీన్ని అద్భుతంగా తెరకెక్కించారు'' అంది. ''సాధారణంగా ఊర్లలో ఉండే అమ్మాయిల్ని.. 'ఈ పని చేయి, ఆ పని చేయక'ని ఆంక్షలు పెడుతుంటారు. అలాంటి వాళ్లు బయటకు వెళ్తే ఎలా మారతారనే విషయాన్ని ఈ సిరీస్‌లో చక్కగా చూపించార''న్నారు నటుడు సూర్య వశిష్ఠ. దర్శకుడు బి.కిశోర్ మాట్లాడుతూ.. ''శ్రీకారం' తర్వాత ఈ సిరీస్ చేయడం చాలా ఆనందంగా ఉంది. దీన్ని చూసే ప్రేక్షకుల సమయం అసలు వృథా కాదు. ఇది ఆద్యంతం ప్రేక్షకుల్ని అలరిస్తుంది'' అన్నారు. ఈ కార్యక్రమంలో శివ కందుకూరి, సుధాకర్, మౌనిక, నందిని, జై క్రిష్ తదితరులు పాల్గొన్నారు.



# గుడ్ వైఫ్ వెబ్ సిరీస్‌తో వస్తోన్న ప్రియమణి

ఒక్కప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా చక్రం తిప్పిన ప్రియమణి.. ప్రజెంట్ రీ ఎంట్రీ ఇచ్చి సిల్వర్ స్క్రీన్, స్మాల్ స్క్రీన్, డిజిటల్ స్క్రీన్ అని తేడాలు చూడడం లేదు. తనకు నచ్చిన కథలు ఎక్కడ లభిస్తే అక్కడ యాక్ట్ చేస్తుపోతుంది. రీసెంట్ గా 'ది ఫ్యామిలీ మ్యాన్' సీజన్ ఆమెకు మంచి గుర్తింపు తెచ్చి పెట్టగా.. తాజాగా 'గుడ్ వైఫ్' అనే వెబ్ సిరిస్ తో రాబోతుంది ప్రియమణి. అమెరికన్ వెబ్ సిరీస్ 'ది గుడ్ వైఫ్' ఆధారంగా ఈ వెబ్ సిరీస్ రూపొందినట్లు- సమాచారం. సెక్స్ కుంభకోణంలో చిక్కుకున్న తన భర్తను రక్షించేందుకు ఓ మాజీ లాయర్ చేసిన పోరాటం నేపథ్యంలో అదిరిపోయే థ్రిల్లింగ్, ఎమోషనల్ డ్రామాగా ఉండనుంది. త్వరలో ఈ సిరీస్ స్ట్రీమింగ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా ఈ సిరీస్‌కు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. కాగా ఈ మూవీలో ప్రియమణి లుక్ చాలా డిఫరెంట్ గా ఉంది. సాధారణంగా పాన్ ఇండియా రిలీజ్ అంటే హిందీతో పాటు- దక్షిణాది భాషలైన తెలుగు, తమిళ, కన్నడ, మలయాళంలో ఇలా విడుదల చేస్తూ వస్తున్నారు. కానీ ఇప్పుడు ఈ సిరీస్ రిలీజ్ అంతకు మించి అని చెప్పాలి. హిందీ, తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషలతో పాటు- మరాఠీ, బెంగాలీలో కూడా సిరీస్ స్ట్రీమింగ్ చేయనున్నట్లు- జియో హాట్ స్టార్ ఓటీటీ పేర్కొంది.


# థగ్‌లైఫ్‌తో అభిరామి రీ ఎంట్రీ



చిత్రపరిశ్రమలో మరోమారు సీనియర్ హీరోయిన్ అభిరామి పేరు బాగా వినపడుతుంది. మణిరత్నం దర్శకత్వంలో కమల్ హాసన్ హీరోగా తెరకెక్కిన 'థగ్‌లైఫ్' మూవీతో అభిరామి కమల్ సరసన నటించి తిరిగి ఫామ్ లోకి వచ్చింది. జూన్ 5న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. అయితే ఈ ట్రైలర్‌లో ముఖ్యంగా కమల్ హాసన్, అభిరామి మధ్య ఘాటైన లిప్‌లాక్ సీన్ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీ అయ్యింది. దీంతో ప్రజెంట్ జనరేషన్ వారు ఈ హీరోయిన్ గురించి సెర్చింగ్ మొదలు పెట్టారు.. కేరళకు చెందిన అభిరామి అసలు పేరు దివ్య గోపికుమార్. 1995లో 'కథపురుషన్' అనే మలయాళ సినిమాలో బాలనటిగా కనిపించి ఆ తర్వాత హీరోయిన్‌గా మారింది. తెలుగులో 'థ్యాంక్యూ సుబ్బారావు', 'చార్మినార్', 'చెప్పవే చిరుగాలి' వంటి సినిమాల్లో నటించారు. ఇక 2009లో రాహుల్ పవనన్‌తో ఆమె వివాహం జరిగి, దాదాపు పదేళ్ల పాటు- సినిమాలకు దూరంగా ఉన్న అభిరామి.. 2014లో తిరిగి రీ ఎంట్రీ ఇచ్చారు. నాటి నుంచి తన వయసు, ఇమేజ్, అనుభవాన్ని దృష్టిలో పెట్టు-కుని కథాబలమున్న చిత్రాలనే చేస్తూ వస్తున్నారు అభిరామి. కానీ అందం విషయంలో మాత్రం అలాగే ఉంది . 40 ఏళ్ళు దాటిన కూడా ఇప్పటికి యంగ్ లుక్ లో మెరుస్తూ ఉంటుంది. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉంటుంది. ఇందులో భాగంగా తాజాగా తనకు సంబంధించిన ఫోటోలు పంచుకుంది.

# సిద్దూ జొన్నలగడ్డ పెద్ద మనసు

## పారితోషికంలో సగం రిటర్న్



సిద్దు జొన్నలగడ్డ పెద్ద మనసు చాటుకున్నాడు. ఇచ్చిన పారితోషికంలో సగం తిరిగి ఇచ్చేసి నిర్మాతను ఆదుకున్నాడు. 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో, సిద్దు జొన్నలగడ్డ హీరోగా వచ్చిన చిత్రం 'జాక్'. 'డీజే టిల్లు', 'టిల్లు స్క్వేర్' వంటి వరుస హిట్స్ తర్వాత సిద్ధూ నటించిన ఈ మూవీ, ప్రేక్షకుల అంచనాలను తలకిందులు చేస్తూ అనూహ్యంగా ఊహించని విధంగా ఫ్లాప్ అయ్యింది. నైజాం తో పాటు- కొన్ని ఏరియాల్లో డిస్ట్రిబ్యూటర్లు చాలా లాస్ అయ్యారు. ఈ నేపథ్యంలో నిర్మాతను ఆదుకోవడానికి హీరో ముందుకు వచ్చారు. జాక్' సినిమాకు గాను సిద్దు జొన్నలగడ్డ ఎనిమిది కోట్ల రూపాయల పారితోషికం అందుకోగా, తాజా సమాచారం ప్రకారం తన పారితోషికం నుంచి సగం, అంటే 4 కోట్ల రూపాయలు నిర్మాతకు తిరిగి ఇచ్చి, తన పెద్ద మనసును చాటు-కున్నాడు. ఈ చర్య సినీ పరిశ్రమలో అరుదైన, ఆదర్శనీయమైన ఉదాహరణగా నిలిచింది. సిద్దు ఈ విధమైన బాధ్యతాయుతమైన, నీతిగల నిర్ణయంపై.. నెటిజన్లు, సినీ ప్రముఖులు, అభిమానులు అందరూ ఆశ్చర్యపోయి, అతని మంచితనాన్ని ఆకాశాని కెత్తేస్తున్నారు. సోషల్ మీడియాలో సిద్దు గురించి ప్రశంసలు కురుస్తున్నాయి. 'సిద్దు లాంటి నటు-లు నిర్మాతలకు అండగా నిలిస్తే, సినీ పరిశ్రమ మరింత విజయవంతమవుతుంది' అని అభిమానులు, విశ్లేషకులు కామెంట్స్ చేస్తున్నారు. ఈ చర్య సిద్దు జొన్నలగడ్డను కేవలం ఒక నటు-డిగా కాక, ఒక బాధ్యతాయుతమైన వ్యక్తిగా, సినీ పరిశ్రమకు ఆదర్శంగా నిలిపింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DHEEKONDA SHIVAKRISHNA, PRINTER TELUKALA BHASKAR REDDY, PRINTED AT RAINBOW OFFSET PRINTERS, 6-8-142, SAGARA VEEDHI CHOWRASTHA, HANUMAKONDA, WARANGAL, TELANGANA- 506001.PUBLISHED AT: H.NO: 7-37, ZAFFERGADH ROAD, WARDHANNAPET, WARANGAL, TELANGANA- 506313. EDITOR: DHEEKONA SHIVAKRISHNA. PRGI NO: TGTEL/25/A0438, CELL: 9700950084, 7396206302, email: startrinethram28@gmail.com